క్లుప్తంగా

ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ



యూనిఫాం ఇస్తున్న హెచ్‌ఎం, అధికారి

కడెం: ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ అలవడుతుందని మండలంలోని లింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బచ్చువెంకటరమణ, ఎన్‌సీసీ అధికారి బొమ్మిడి మహేశ్వర్ అన్నారు. గురువారం పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భూమేశ్వర్, పీడీ ప్రభాకర్ తదితరులున్నారు.

తనిఖీ బృందాల పర్యటన

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం నుంచి వారం రోజులపాటు సామాజిక తనిఖీ బృందాల సభ్యులు పర్యటిస్తారని ఏపీవో గట్టుపల్లి నవీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులను పరిశీలించి నివేదిక అందిస్తారని పేర్కొన్నారు. తనిఖీ బృందాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పల్లెప్రగతిపై దృష్టి సారించాలి



పనులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: పల్లెప్రగతిపై దృష్టి సాధించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. మంచినీటి ట్యాంకుల్లో 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ఎంపీవో ఎంఏ.రహీం ఖాన్, పంచాయతీ కార్యదర్శులు రాజబాపు, సతీశ్, సాహేందర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్మల్ పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతం కోసం తమ వంతు కృషి చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా ఒల్లెపు తిరుపతి, విఠల్, మగ్గిడి భూమేశ్, వడ్నాల రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శులుగా కొండాజి శ్రావణ్, జైల లింగం, కార్యదర్శులుగా కాంబ్లే వెంకట్, కందుల రవి, గంజి రాజు, దోమకొండ రాకేశ్‌ను ఎన్నుకున్నారు.


నర్సాపూర్(జి) మండల కార్యవర్గం..

నర్సాపూర్ (జి): బీజేపీ నర్సాపూర్ (జి) మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బర్కుంట నరేందర్, ప్రధాన కార్యదర్శులుగా జంగోళ్ల మహిపాల్, బాశెట్టి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా దూసముడి నవీన్, చందుగౌడ్, పులి రంజిత్, సిందే ఛత్రపతి, కార్యదర్శులుగా బొల్లి గంగారాం, కల్యాణ్ పటేల్, చరణ్, గంగారాం, కోశాధికారిగా సంగెం అశోక్‌తో పాటు 34మంది సభ్యులను ఎన్నుకున్నారు.

ఖానాపూర్ పట్టణ కార్యవర్గం..

ఖానాపూర్: బీజేపీ ఖానాపూర్ పట్టణ పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మహేందర్, పట్టణ అధ్యక్షుడు మనోజ్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ ఆదేశాలను సారం పట్టణ ఉపాధ్యక్షులుగా సురేందర్, సాయి, మురళి, సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా రమేశ్, శ్రీనివాస్, కోశాధికారిగా రాజశేఖర్, 34 మంది ఇతర కమిటీ సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేయండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.. అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ పథకం లబ్ధిదారుల ఎంపికపై జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలన, ప్రస్తుత స్థితిగతులపై వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల16లోగా మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలని పేర్కొన్నారు. అర్హుల దరఖాస్తులను బ్యాంకులకు పంపించాలన్నారు. బ్యాంకులకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి.. తిరిగి అధికారులకు పంపాలని బ్యాంకు అధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ గోవింద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మండలాల ప్రత్యేక అధి కారులు, ఎంపీడీవోలు, పలువురు బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

‘మహా’ దోపిడీ

- పొరుగు రాష్ట్రం నుంచి సరిహద్దు గ్రామాలకు ఇసుక
- అక్రమంగా రవాణా.. ప్రభుత్వ ఆదాయానికి గండి
- ‘మామూలు’గా చూస్తున్న పోలీసులు, అధికారులు



సింగన్‌గాం గ్రామంలో రోడ్డుపై పోసిన ఇసుక కుప్పలు



నెలకిందట పోలీసులు పట్టుకున్న ఇసుక టిప్పర్

తానూరు: మహారాష్ట్రకు చెందిన స్మగ్లర్లు.. ధనార్జనే ధ్యేయంగా ఇసుకను అక్రమంగా నిర్మల్ జిల్లాకు తరలించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలిసినా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. మహారాష్ట్రలోని ధర్మాబాద్, రా హెర్, నాగని, గోలేగాం, బలేగాం గ్రామాల సమీ పంలోని గోదావరి నది నుంచి వ్యాపారులు ఇసుకను తవ్వి, తెలంగాణలోని తానూరు మండలం సరిహద్దు గ్రామాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఈ చట్టవిరుద్ధ దందా రాత్రివేళ జోరుగా సాగడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

అర్ధరాత్రి రవాణా..

మహారాష్ట్ర వ్యాపారులతో కలిసి తెలంగాణలోని కొందరు వ్యాపారులు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇసుక కావాల్సిన వారు స్థానిక ఏజెంట్లను సంప్రదిస్తే, వారు వాట్సాప్ ద్వారా గమ్యస్థాన వివరాలను మహారాష్ట్ర వ్యాపారులకు పంపిస్తారు. అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు, పోలీసు పెట్రోలింగ్ సమాచారాన్ని తెలుసుకుని, టిప్పర్, లారీల ద్వారా ఇసుకను గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. కర్కెల్లి, ధర్మాబాద్, ఉమ్రి మార్గంలో చెక్‌పోస్టులు లేకపోవడంతో అక్రమ రవాణా సులభమవుతోంది.

పోలీసు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

అప్పుడప్పుడు పోలీసులు తనిఖీలు నిర్వహించి కొన్ని టిప్పర్‌లను పట్టుకుంటున్నప్పటికీ, రెవెన్యూ అధికారుల చర్యలు మాత్రం పెద్దగా కనిపించడం లేదు. పట్టుబడిన వాహనాలను ప్రభావవంతమైన వ్యక్తుల సహాయంతో విడిచిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నిర్లక్ష్యం కారణంగా, అక్రమ ఇసుక రవాణా కోట్ల రూపాయల వ్యాపారంగా మారింది.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

ఒక టిప్పర్ లోడ్‌లో సుమారు 12 బరాస్‌ల ఇసుక రవాణా అవుతుంది, దీనికి ప్రభుత్వానికి దాదాపు రూ.3 వేల చలానా రూపంలో చెల్లించాలి. అయితే చలానా చెల్లించకుండా రాత్రివేళల్లో రవాణా జరుగుతుండటంతో ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం వాటిల్లుతోంది. రోజుకు నాలుగైదు టిప్పర్ల ఇసుక తానూరు మండలంలోని గ్రామాలకు చేరుతున్నట్లు సమాచారం. అనుమతి లేకుండా జరుగుతున్న ఈ దందాపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

చర్యలు తీసుకుంటాం

ఇసుక అనుమతి లేకుండా అక్రమంగా రవాణా చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.మహారాష్ట్ర నుంచి ఇసుక తీసుకొచ్చిన తప్పనిసరిగా చలనా కట్టి అనుమతి తీసుకోవాలి.అక్రమంగా రవాణా చేసి పట్టుబడితే శాఖపరైన చర్యలు తీసుకుంటాం.అక్రమ రవాణాపై నిఘా ర్పాటు చేస్తాం .

– లింగంమూర్తి, తహసీల్దార్, తానూరు

గత ఆదేశాలు, ప్రస్తుత నిర్లక్ష్యం

గతంలో ఉన్నతాధికారులు.. ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని మండలంలోని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో తహసీల్దార్, సిబ్బంది కొంతకాలం దూకుడుగా వ్యవహరించి లారీలను పట్టుకొని జరిమానాలు విధించారు. కానీ ప్రస్తుతం మాత్రం సదరు అధికారులలో చలనం కనిపించడం లేదు, దీనితో అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. స్థానికులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చినా.. పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ముగిసిన సమ్మర్ క్యాంప్



ఎల్వి పాఠశాల క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

తానూరు: వేసవి సెలవుల్లో విద్యార్థులు ఫోన్, టీవీలకు దూరంగా ఉంచేందుకు ప్రభుత్వం ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు మండలంలోని ఆయా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ గురువారం ముగిసింది. సమ్మర్ క్యాంప్‌లో యోగాసనాలు, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్వి పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌ను గురువారం ఎంఈవో నరేందర్ పరిశీలించారు. క్యాంపుల్లో నేర్చుకున్న విషయాలను ఇంటి వద్ద ప్రాక్టీస్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లన్న, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

‘డబుల్’ ఇళ్లు ఆక్రమణ



ఇళ్ల వద్ద మహిళలు



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

- తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశం
- బయటకు పంపించిన సిబ్బంది
- భీష్మించుకొని కూర్చున్న మహిళలు

నర్సాపూర్(జి): నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలకేంద్రంలో 50 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. గతంలో గ్రామసభ నిర్వహించినా ఎవరికీ కేటాయించలేదు. అప్పటి నుంచి సదరు ఇళ్ల సంరక్షణ బాధ్యతలను పంచాయతీరాజ్, రెవెన్యూశాఖలకు అప్పగించడంతో వాటికి తాళాలు వేశారు. రెండేళ్లు గడిచినప్పటికీ ఇళ్లను ఎవరికీ అందించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గురువారం కోపోద్రోక్తులైన నిరుపేద మహిళలు మూకుమ్మడిగా వచ్చి తాళాలు పగలగొట్టి సామాన్లతో డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి ప్రవేశించారు.

మళ్లీ తాళం వేసిన అధికారులు..

ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి మహిళలను సముదాయించారు. కానీ వారు మాట వినకపోవడంతో సిబ్బందిచే సామాన్లు తొలగించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు కొత్త తాళాలు వేశారు. తమకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించేదాకా ఇక్కడి నుంచి కదలమని మహిళలు భీష్మించుకుని కూర్చున్నారు. ఈ విషయం గురించి తహసీల్దార్ శ్రీనివాస్.. ఆర్డీవో రత్నకల్యాణితో ఫోన్‌లో మాట్లాడారు. ఇల్లు లేని వారు తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్, రేషన్‌కార్డ్ లతో వినతిపత్రం ఇవ్వాలని సూచించినప్పటికీ మహిళలు వినకుండా రాత్రి అయినా అక్కడే కూర్చున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇల్లు లేని వారికి డబుల్ బెడ్‌రూం కేటాయించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సాయికిరణ్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఆర్‌ఐ నవతజ్యోతి, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కై లాస్, పోలీస్ కానిస్టేబుళ్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: రెవెన్యూ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూసమస్యల వివరాలు తెలుసుకున్నారు. భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. అటవీశాఖతో ఉన్న భూవివాదాలపై రెవెన్యూ, అటవీశాఖల అధికారులు కలిసి సర్వే చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రతీ మండలానికి సంబంధించిన భూముల వివరాలతో సమగ్ర ప్రొఫైల్ తయారు చేయాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటాల మండలంలో ప్రస్తుతం ఉన్న భూసమస్యల పరిష్కార దశలను అధికారులతో చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

‘రైతులను ఇబ్బంది పెట్టొద్దని వినతి’

నిర్మల్‌చైన్‌గేట్: వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో తాలు, తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు తీసుకోవాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత రైస్‌మిల్లులకు పంపితే.. అక్కడా మిల్లర్లు తరుగు పేరిట కోత విధిస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. జాప్యం లేకుండా తూకం వేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు పంపించాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్
- సిరాల ప్రాజెక్టు పనులు పరిశీలన



సిరాల ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని రాంటెక్ గ్రామంలో కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.24లక్షలు కేటాయించిట్లు వివరించారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సాగౌడ్, మాజీ జెడ్పీటీసీ, రమేశ్, రమేశ్, నాయకులు సుదర్శన్, తాటివార్ రమేశ్, వరగంటి జీవన్, శ్రీనివాస్, శ్యామ్‌రావు, భుజంగ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు నీరందించేలా కృషి

భైంసారూరల్: సిరాల ప్రాజెక్టు పనులు పూర్తి చేసి.. ఖరీఫ్ పంటలకు సాగు నీరందించేలా కృషి చేస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని సిరాల ప్రాజెక్టు పనులను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. రెండేళ్ల కిందట భారీవర్షాలకు సిరాల ప్రాజెక్టు కట్ట తెగిపోయిందని.. తాను ఎమ్మెల్యే అయ్యాక ప్రభుత్వం ప్రాజెక్టు పునర్ నిర్మాణానికి రూ.12 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో ప్రస్తుతం పనులు చేపడుతుట్లు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే సిరాల, ఇలేగాం, దేగాంతోపాటు ఆయా గ్రామాల రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. రైతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈఈ అనిల్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ మండలాధ్యక్షురాలు సుష్మారెడ్డి, నాయకులు పండిత్‌రావు, రమేశ్, భూమేశ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చెక్కులు అందిస్తున్న నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి. నారాయణ్‌రావు పటేల్ అన్నారు. గురువారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో 40 మంది లబ్ధిదారులకు రూ.20 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. బాధితులకు చెక్కులు మంజూరు చేసినందుకు సీఎంతోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, గంగారెడ్డి, బషీర్, సుదర్శన్, షఫీ, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నర్సయ్య

తానూరు: ఒకేరకం పంటలను సాగు చేయకుండా తరచుగా మార్పిడి చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ముధోల్ ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త ఇ.నర్సయ్య సూచించారు. గురువారం మండలంలోని దాగాం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు సాగు విధానంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయాధికారుల సూచనలతో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసి లాభాలు పొందాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా పంట చేతకొచ్చే వరకు రసీదు భద్రపర్చుకోవాలని సూచించారు. ఎవరైనా విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. శాస్త్రవేత్త కార్తీక్, రైతులు నాగోరావ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని గాజులపేట్‌లో శుక్రవారం నిర్వహించే విశాలక్షి సమేత శ్రీ విశ్వేశ్వర ఆలయ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యస్వామి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ చేతుల మీదుగా ఆలయ సమీపంలో హోమం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

‘హక్కుపత్రాలు లేని భూములు అటవీశాఖకే’




మాట్లాడుతున్న డిప్యూటీ రేంజ్ అధికారి

కడెం: హక్కుపత్రాలు లేకుండా అక్రమంగా సాగు చేస్తున్న పోడు భూములను అటవీశాఖ స్వాధీనం చేసుకుంటుందని డిప్యూటీ రేంజ్ అధికారి సిద్ధార్థ అన్నారు. ఎఫ్‌డీపీటీ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని పాండ్వపూర్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుపత్రాలు లేని పోడుభూములు సాగు చేయకుండా అటవీశాఖకు సహకరించాలని కోరారు. ఇందులో అటవీశాఖ సిబ్బంది తదితరులున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

స్తంభాలు సరిచేశారు



సరిచేసిన విద్యుత్ స్తంభం

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని శివారు వ్యవసాయ భూముల్లో వంగిన కరెంటు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. దీని పై ఈనెల 14న ‘స్తంభాలు సరి చేయరూ’శీర్షికన కథ నం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ డి.శంకర్ గురువారం సిబ్బంది చేత వంగిన స్తంభాలను సరి చేయించారు.

గుంతలు పూడ్చివేశారు.



పోలీస్‌స్టేషన్ ఎదుట పూడ్చిన గుంత

బాసర: మండలకేంద్రంలో రోడ్లపై గుంతలు ఏర్పడటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 15న సాక్షిలో ‘గుంతలు పూడ్చివేయరూ’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. బాసర పోలీస్‌స్టేషన్, బస్టాండ్ సమీపంలో వివేకానంద చౌక్, ఆలయానికి వెళ్లే టీటీడీ మలుపు వద్ద ఉన్న గుంతలను పూడ్చివేయించారు.

వివాహానికి ట్రస్ట్ చేయూత

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగురాలైన యువతి వివాహానికి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. యువతి కుటుంబీకులు సాయం కోరడంతో స్పందించిన ట్రస్ట్ సభ్యులు రూ.20 విలువైన సామగ్రి అందించారు. గురువారం దిలావర్‌పూర్‌కు వెళ్లి వంట సామగ్రి, బీరువా, పట్టుచీర, 70 మంది భోజనానికి కావాల్సిన సరుకులు అందించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, మనోజ్, రవితేజ తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని సకాలంలో తరలించాలి



కల్లూరులో పరిశీలిస్తున్న డీఆర్డీవో విజయలక్ష్మి

కుంటాల: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని జాప్యం చేయకుండా వెంటనే మిల్లులకు తరలించాలని డీఆర్డీవో విజయలక్ష్మి.. సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని కల్లూరు, కుంటాలలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి సుధాకర్, డీపీఎం రాజేశ్వర్, ఏపీఎం అశోక్ తదితరులు ఉన్నారు.